నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
I | ఖమ్మం, గురువారం 1 మే 2025 | BHADRADRI KOTHAGUDEM

టెన్త్ ఫలితాల్లో ప్రతిభ చూపిన బూర్గంపహాడ్ మైనార్టీ గురుకుల విద్యార్థినులు



పదిలో పడిపాయె..

- ముగ్గురు కీలక మంత్రులున్నా దక్కని మెరుగైన స్థానం
- టెన్త్ ఫలితాల్లో ఖమ్మం, భద్రాద్రిలకు 21, 27 స్థానాలు
- ఖమ్మంలో 94.47 శాతం, కొత్తగూడెంలో 91.49 ఉత్తీర్ణత
- మార్కులు, గ్రేడులు కలిపి పదో తరగతి ఫలితాలు విడుదల

ఖమ్మం అర్బన్, ఏప్రిల్ 30: టెన్త్ ఫలితాల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా నిరాశాజనక ఫలితాలను సాధించింది. ఉమ్మడి జిల్లాలో ముగ్గురు కీలకమైన మంత్రులున్నా జిల్లా విద్యాశాఖపైనా, టెన్త్ ఉత్తీర్ణత శాతం పెంపుదలపైనా దృష్టిపెట్టిన దాఖలాలు లేవు. ఆ ప్రభావం తాజా టెన్త్ ఫలితాల్లో స్పష్టంగా కన్పించింది. ఎస్ఎస్సీ బోర్డు బుధవారం విడుదల చేసిన పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో పరిశీలిస్తే ఖమ్మం జిల్లా 21వ స్థానంలో, భద్రాద్రి జిల్లా 27వ స్థానంలో నిలిచాయి. గతంలో రాష్ట్రంలోకెల్లా అన్ని జిల్లాలకంటే ఖమ్మం జిల్లా అత్యుత్తమ ఉత్తీర్ణతను సాధించేది. హైదరాబాద్ తర్వాత ఖమ్మం జిల్లానే ఎడ్యుకేషన్ హబ్‌గా నిలిచేది. తెలంగాణ ఏర్పాటు అనంతరం ఒక్క దఫా మినహా ఎక్కువసార్లు రాష్ట్రస్థాయిలో 15వ స్థానంలోపే నిలిచింది. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక జిల్లా విద్యాశాఖపై పట్టింపులేని చర్యల వల్ల మెరుగైన స్థానాలు కోల్పోతూ వస్తోంది. నిరుటి ఫలితాలు, తాజా ఫలితాలు ఇందుకు అద్దం పడుతున్నాయి. ఈ రెండేళ్లలోనూ రాష్ట్రస్థాయిలో ఖమ్మం జిల్లా వరుసగా 21వ స్థానంలోనే నిలిచింది.

కొన్నేళ్ల 'ఖమ్మం' టెన్త్ ఫలితాలను పరిశీలిస్తే..

సంవత్సరం	శాతం	స్థానం
2023	86.60	18వ స్థానం
2024	93.31	21వ స్థానం
2025	92.78	21వ స్థానం

ఖమ్మంలో 94.47 శాతం..

ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 16,391 మంది విద్యార్థులు ఈ ఏడాది టెన్త్ పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో బాలురు 8,408 మంది, బాలికలు 7,983 మంది పరీక్షలు రాశారు. బాలురు 7,858 మంది పాసై 93.46 శాతం ఉత్తీర్ణతను నమోదు చేశారు. బాలికలు 7,627 మంది పాసై 95.54 శాతం ఉత్తీర్ణతను నమోదు చేశారు. మొత్తంగా 15,485 మంది విద్యార్థులు పాసై 94.47 శాతం ఉత్తీర్ణతను సాధించారు. అయితే, రాష్ట్ర సగటు 92.78 ఉత్తీర్ణతతో పోలిస్తే జిల్లా ఉత్తీర్ణత 1.7 శాతం అధికంగా ఉంది. అన్ని పరీక్షల్లాగే టెన్త్‌లోనూ బాలికలే పైచేయి సాధించారు. బాలురపై రెండు శాతం ఎక్కువ ఉత్తీర్ణతతో రాణించారు.

బీసీ గురుకుల విద్యార్థినికి 593 మార్కులు..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎస్ఎస్సీ ఫలితాల్లో బీసీ గురుకులాల విద్యార్థులు ప్రతిభకనబర్చారు. మొత్తం 1,351 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 1,314 మంది పాసై 97.26 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. దానవాయిగూడెం ఎంజేపీబీసీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని టీ.దుర్గాభవానీ 593 మార్కులతో టాపర్‌గా నిలిచింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న 22 బీసీ గురుకుల పాఠశాలల్లో 10 పాఠశాలలు నూరుశాతం ఉత్తీర్ణత సాధించాయి. విద్యార్థులను రాష్ట్ర సెక్రటరీ బీ.సైదులు, ప్రాంతీయ సమన్వయాధికారి సీహెచ్.రాంబాబు అభినందించారు.

సోషల్ వెల్ఫేర్‌లో..

ఖమ్మంలోని సోషల్ వెల్ఫేర్‌కు చెందిన 12 గురుకులాల నుంచి 923 మంది విద్యార్థులకుగాను 900 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాశారు. 23 మంది గైర్హాజరయ్యారు. ఎర్రుపాలెం గురుకుల విద్యార్థిని అత్యధికంగా రిషిత 566 మార్కులు సాధించినట్లు జోనల్ ఆఫీసర్ స్వరూపరాణి తెలిపారు.

మార్కులు, గ్రేడులతో ఫలితాలు..

టెన్త్ ఫలితాల్లో ఈసారి గ్రేడులతోపాటు మార్కులను కూడా ప్రకటించారు. ఇంటర్నల్స్‌కు 20 మార్కులుపోగా 80 మార్కులకు వార్షిక పరీక్షలు నిర్వహించారు. ఫలితాల విడుదలలో ఇంటర్నల్, వార్షిక పరీక్షల మార్కులు, గ్రేడింగ్‌లను పొందుపరిచారు.

భద్రాద్రి జిల్లాకు 27వ స్థానం

91.49 శాతం ఉత్తీర్ణత

కొత్తగూడెం గణేశ్ టెంపుల్, ఏప్రిల్ 30: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో భద్రాద్రి జిల్లా విద్యార్థులు 91.49 శాతం ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్రంలోకెల్లా భద్రాద్రి జిల్లా 27వ స్థానంలో నిలిచింది. అయితే, నిరుడు 90.39 శాతంగా ఉన్న ఉత్తీర్ణత.. ఈ ఏడాది 1.10 శాతం పెరిగి 91.49గా నమోదైంది. భద్రాద్రి జిల్లా నుంచి 5,971 మంది బాలురు, 6279 మంది బాలికలు కలిపి మొత్తం 12,250 మంది పరీక్షలు రాశారు. వీరిలో 5,320 మంది బాలురు, 5,888 మంది బాలికలు కలిపి 11,208 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురు 89.10 శాతం, బాలికలు 93.77 శాతం ఉత్తీర్ణత సాధించారు.



కొనుగోలు కేంద్రంలో రైతుల నిరసన

మిల్లర్ల కోతలు, కొర్రీలపై చర్య తీసుకోవాలని డిమాండ్

దామరచర్ల కొనుగోలు కేంద్రంలో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

చండ్రుగొండ, ఏప్రిల్ 30 : తేమ శాతం ఉన్న ధాన్యాన్ని దింపుకోవడానికి మిల్లర్లు నిరాకరిస్తున్నారని ఆరోపిస్తూ చండ్రుగొండ మండలం దామరచర్ల గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో రైతులు బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ తమను నిలుపు దోపిడీ చేస్తున్న మిల్లర్లపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధాన్యం లారీలకొద్దీ ఎగుమతికి సిద్ధంగా ఉన్నదని, అయినా మిల్లర్లు కొర్రీలు పెట్టడం వల్ల కాంటాలు సక్రమంగా జరగడం లేదన్నారు. ధాన్యం ఆరబెట్టి తీసుకొస్తున్నా బస్తాకు 3 కేజీలు అదనంగా కాంటా వేయాలని, క్వింటా ధాన్యానికి 5 నుంచి 7 కేజీల వరకు అదనంగా కాంటా వేస్తేనే దిగుమతి చేసుకుంటామని మిల్లర్లు బెదిరిస్తున్నారని రైతులు ఆరోపించారు. ఇంత జరుగుతున్నా ఇటు అధికారులు, అటు ప్రజాప్రతినిధులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మిల్లర్ల దోపిడీ ఆపకపోతే మూకుమ్మడిగా రైతులందరం కలిసి రోడ్డెక్కుతామని హెచ్చరించారు.

ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో దివ్యాంగులకూ ప్రాధాన్యమివ్వాలి

ముదిగొండ మండల పరిషత్ ఎదుట నిరసన

ముదిగొండ మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న దివ్యాంగులు

ముదిగొండ, ఏప్రిల్ 30 : ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో తమకూ ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతూ వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ముదిగొండ మండల పరిషత్ కార్యాలయం ఎదుట బుధవారం పలువురు దివ్యాంగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఎంపిక చేస్తున్న జాబితాలో ఒక్క దివ్యాంగుడు కూడా లేకపోవడం బాధాకరమని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లలో 5 శాతం దివ్యాంగులకు కేటాయిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే ప్రాధాన్యం ఇచ్చే విధంగా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బొజ్జ జీవరత్నం, గుంజులూరి వీరబాబు, సీతారాములు, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలని రైతుల ధర్నా

చేగొమ్మ క్రాస్‌రోడ్డు వద్ద భారీగా స్తంభించిన ట్రాఫిక్

కూసుమంచి, ఏప్రిల్ 30 : ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని డిమాండ్ చేస్తూ కూసుమంచి మండలం చేగొమ్మ క్రాస్‌రోడ్డు వద్ద ఖమ్మం–సూర్యాపేట పాత రహదారిపై సీపీఎం నాయకులతో కలిసి రైతులు బుధవారం ధర్నా నిర్వహించారు. దీంతో ట్రాఫిక్ భారీగా స్తంభించిపోయింది. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ కాంటాలు పూర్తయినప్పటికీ లారీలు రాకపోవడంతో ఇబ్బందిపడుతున్నామని అన్నారు. మధ్యాహ్నం అకాల వర్షం రావడంతో కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం కొంతమేర తడిచిపోయిందని, దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని వారు ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న కూసుమంచి ఎస్సై నాగరాజు, మండల వ్యవసాయాధికారి ఆర్.వాణి ఘటనా స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడారు. ఉన్నతాధికారులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం సీపీఎం నాయకుడు తోటకూరి నాగరాజు ఆధ్వర్యంలో నాయకులు, రైతులు మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి తమ సమస్యను వివరించారు. కార్యక్రమంలో మల్లెపల్లి మాజీ సర్పంచ్ రవి, నాయకులు గంగాధర్, గురుమూర్తి, పలువురు రైతులు పాల్గొన్నారు.